సాక్షి ములుగు

మంగళవారం | 22 | ఏప్రిల్ | 2025



విద్యుత్ పునరుద్ధరణ.. ఇక క్షణాల్లోనే..

విద్యుత్ లైన్లలో సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ పోల్ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టింది. - 8లో▸



లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆర్ఐ - 8లో▸

జనగామ జిల్లా చిల్పూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ ఆర్ఐ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.0° /25.0°

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి పలు చోట్ల ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రవళికకు మంత్రి సీతక్క పరామర్శ



ములుగు రూరల్: ములుగు ఏరియా ఆస్పత్రిలో ప్రసవ సమయంలో బిడ్డను కోల్పోయిన రవళిక హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సోమవారం పరామర్శించారు. ఈ మేరకు ఆరోగ్య విషయంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ రవళిక వైద్య ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని, బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

అక్రమ గ్యాస్ సిలిండర్ల పట్టివేత



గోవిందరావుపేట: మండల పరిధిలోని సివిల్ సప్లయీస్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్రమ గ్యాస్ సిలిండర్లు పట్టుకున్నారు. మండలంలోని వివిధ హోటళ్లు, గ్యాస్ ఫిల్లింగ్ చేసే షాపులు, చికెన్ సెంటర్లు, టీ స్టాల్స్, కిరాణ షాపుల్లో సివిల్ సప్లయీస్ జిల్లా అధికారి ఫైసల్ హుస్సేన్, ములుగు, ఏటూరునాగారం డిప్యూటీ తహసీల్దార్లు, పౌర సరఫరాల శాఖల అధికారులు తనిఖీ నిర్వహించారు. నిబంధనల మేరకు పలువురిపై కేసు నమోదు చేశారు. అనంతరం పలు సూచనలు చేశారు.

ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్‌గా సతీష్

వెంకటాపురం(కె): ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్‌గా పర్శిక సతీష్‌ను నియమించారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీను హాజరయ్యారు. ఆయన సమక్షంలో జిల్లా కన్వీనర్‌గా సతీష్, కో కన్వీనర్‌గా టింగ బుచ్చయ్య, పాయం భారతి, కుర్సం శివశంకర్, తాటి రామచందర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 5న ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి కోరారు. సింగరేణి పాఠశాలలోని శిక్షణ తరగుతులను జీఎం సోమవారం సందర్శించి మాట్లాడారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా ప్రతీ సంవత్సరం రూ.45 కోట్లను విద్యకు ఖర్చు చేస్తుందన్నారు. ఏరియా పరిసర ప్రాంతాల పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి మారుతి, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సిరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్లాట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి



భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించనున్న రిజిస్ట్రేషన్ స్లాట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని జిల్లా డాక్యుమెంట్ రైటర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొడ రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగించాలని, డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్సులు ఇవ్వాలని కోరారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నమన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు బుర్ర అశోక్, జితేందర్, వినోద్, రమేష్, విజయ్, ప్రశాంత్, విక్రమ్, రాజేష్, రాజు, సదానందం, సునిల్ పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు



గిరిజన దర్బార్‌లో వినతి స్వీకరిస్తున్న పీఓ చిత్రామిశ్రా



వినతుల వెల్లువ

గ్రీవెన్స్, గిరిజన దర్బార్‌లో సమస్యలు పరిష్కరించాలని బాధితుల మొర

- వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్లు, పీఓ
- మొత్తంగా 54 దరఖాస్తుల స్వీకరణ
- పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

ములుగు/ఏటూరునాగారం: కలెక్టరేట్, ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్, గిరిజన దర్బార్‌కు ప్రజలు భారీగా తరలివచ్చి పలు సమస్యలపై వినతులు అందజేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్లు సంపత్‌రావు, మహేందర్ జీలు ప్రజల నుంచి 39దరఖాస్తులు స్వీకరించారు. ఐటీడీఏలో పీఓ చిత్రామిశ్రా 15దరఖాస్తులు స్వీకరించారు. మొత్తంగా వివిధ సమస్యలపై 54 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించిన అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆయా శాఖల అధికారులకు సిఫారసు చేశారు. గ్రీవెన్స్ సెల్‌లో భూ సమస్యలు పరిష్కరించాలని బాధితులు అత్యధిక దరఖాస్తులు సమర్పించారు.



ఈ ఫొటోలో ఉన్నవ్యక్తి పేరు ఎట్టి రేవతి. ఎస్ఎస్ తాడ్వాయి మండలం భూపతిపురంకు చెందిన గిరిజన మహిళ. 2016లో జీఎన్ఎంగా పూర్తి చేసింది. ఐటీడీఏ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జీఎన్ఎం పోస్టు ఇప్పించి ఆదుకోవాలని గిరిజన దర్బార్‌లో పీఓకు వినతి అందజేసేందుకు వచ్చింది. తనకు ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని పీఓకు మొరపెట్టుకుంది.

గిరిజన దర్బార్‌లో వినతులు ఇలా..

కన్నాయిగూడెం మండలం ఏహెచ్ఎస్‌లో సీఆర్‌టీగా పనిచేస్తున్న సనప సుహాసిని తన ఇటీవల పాపకు ఆపరేషన్ జరిగిందని.. అందుకోసం ఏటూరునాగారం ఐటీడీఏ నుంచి భద్రాచలం ఐటీడీఏకు డిప్యూటేషన్ చేయాలని వేడుకున్నారు. కన్నాయిగూడెం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆర్ఐటీఐ పూర్తి చేసిన ఆదివాసీలతో కట్టర్ జాబ్స్ భర్తీ చేయాలని బాధితులు కోరారు. ఏటూరునాగారం మండలం ఆకులవారిఘణపురం ప్రాంతానికి చెందిన కేంసర్తి అరుణ ఏదైనా జీవనోపాధి కల్పించి ఆదుకోవాలని వేడుకున్నారు. మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు ప్రాంతంలో గల ఐటీడీఏ కాంప్లెక్స్ భవనం మరమ్మతులు చేయించాలని స్థానిక గిరిజన మహిళ ఐడే సులోచన కోరారు. మంగపేట మండలం బాలన్నగూడెం ప్రాంతంలో ఉన్న భూములను గతంలో అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారని వాటిని తిరిగి ఇప్పించాలని గిరిజన రైతులు తిరుపతి, లక్ష్మయ్యతో పాటు మరో 14 మంది గిరిజనులు విన్నవించారు. మహబూబాబాద్ మండలం రెడ్యాల ప్రాంతానికి చెందిన శ్రీరాములు, కృష్ణయ్యలు రెండ్యాల ప్రాంతంలోని కమ్యూనిటీ హాల్‌కు సీసీ రోడ్డు, నీటి పైపులైన్లు నిర్మించేందుకు నిధులు మంజూరు ఇవ్వాలని కోరారు. తాడ్వాయి మండలం మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ తాడ్వాయిలోని ఎంపీపీఎస్‌కు కొత్త పాఠశాల నిర్మించాలని కోరారు. తాడ్వాయి మండలం రంగాపూర్, కోమటిపల్లి, చెల్పాక క్లాస్–4 ఉద్యోగులు ఇన్‌చార్జ్ వార్డులుగా పనిచేస్తూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారికి ప్రమోషన్ కల్పించి గ్రేడ్–2 వార్డెన్‌గా ప్రమోషన్ కల్పించాలని పీఓకు విన్నవించారు. ఏటూరునాగారం మండలం గోగుపల్లిలో జరుపుల బానుచందర్ పంట చేనుకు బోరు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాజ్‌కుమార్, ఎస్ఓ సురేష్‌బాబు, డీడీ పోచం, ఐటీఐ టీపీ ముధీన్, విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన దరఖాస్తుల వివరాలు	భూ సమస్యలు	ఉపాధి కల్పించాలని..	ఇందిరమ్మ ఇళ్లు	ఇతర సమస్యలు
	16	04	03	16

అంబేడ్కర్ భవన నిర్మాణ స్థలానికి ప్రహరీ నిర్మించాలి..



ములుగు మండలం బండారుపల్లి శివారులో కేటాయించిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భవన నిర్మాణ స్థలానికి ప్రహరీ నిర్మించాలని తెలంగాణ భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. అనేక సంవత్సరాలుగా నిర్మాణ పనులు మొదలుపెడతామని చెప్పినా పనులు ముందుకుసాగడం లేదు. పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడంలేదని తెలిపారు. తగిన చర్యలు తీసుకోవాలని జన్ను రవి, చంటి భద్రయ్య, రాజ్‌కుమార్, దేవేందర్, రాజు, అనిల్ కోరారు.

- తెలంగాణ భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి సభ్యులు

చెరువుశిఖం భూములను పరిరక్షించాలి..



మంగపేట మండలంలోని 150 చెరువుల శిఖం భూములు కబ్జాకు గురై అన్యాక్రాంతం అవుతున్నాయి. వాటికి హద్దులు పాతి అభివృద్ధి పనులు చేపట్టాలి. చెరువులను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేలా చూడాలి. తూములు, కాల్వలు మరమ్మతులు చేపట్టి రెండు పంటలకు నీరు నిల్వ ఉండే విధంగా చెరువుల అభివృద్ధికి ఐటీడీఏ కృషి చేయాలి.

- తొలెం నర్సింహరావు, శనిగకుంట, మంగపేట

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులు పూర్తిచేయాలి



గోవిందరావుపేట మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో 2018లో 34 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు అయ్యాయి. లబ్ధిదారుల కమిటీని ఏర్పాటు చేసి నిర్మాణ పనులు మొదలుపెట్టాం. ఐటీడీఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం రూ.1.50కోట్లు మంజూరు అయ్యాయి. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ. 22లక్షలు నిలిచిపోయాయి. ఈ విషయంలో ఐటీడీఏ పీఓ, కలెక్టర్లకు పలుమార్లు పనులు పూర్తి చేయాలని విన్నవించాం. పెండింగ్ నిధులు మంజూరైతే ఇళ్ల పనులు పూర్తి అవుతాయి. ఒకేసారి నిధులు మంజూరు చేస్తే లబ్ధిదారులకు ఆసరాగా ఉంటుంది.

- ఎన్టీఆర్ కాలనీ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు

'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం

కలెక్టర్ టీఎస్.దివాకర



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారంతో పాటు భూమి హక్కు పట్టాలు రైతులు పొందుతారని కలెక్టర్ టీఎస్.దివాకర తెలిపారు. మల్లంపల్లి మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ధరణి పొరపాట్లను సవరించేందుకు కలెక్టర్లకు తప్ప ఏ అధికారికి అవకాశం లేకుండా పోయిందన్నారు. దీంతో తహసీల్దార్ స్థాయిలో వేల సంఖ్యలో దరఖాస్తులు పేరుకుపోయాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం భూ భారతి ద్వారా భూ సమస్యల పొరపాట్ల సవరణకు అవకాశం కల్పించిందని తెలిపారు. మ్యూటేషన్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. రెండంచెల అప్పీల్ వ్యవస్థతో రైతులు భూ సమస్యలపై కోర్టు వరకు వెళ్లే అవసరం దాదాపుగా ఉండదని వివరించారు. గత చట్టానికి అనుగుణంగా మరో 14 నూతన అంశాలను పొందుపరిచారని తెలిపారు. ప్రతీ వ్యక్తికి గుర్తింపు కార్డు ఉన్న తరహాలో భూ భారతి చట్టం ద్వారా భూమి హక్కు పట్టాలు పొందుతారని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విజయభాస్కర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

2,208.34ఎకరాల్లో పంట నష్టం

వివరాలు వెల్లడించిన అధికారులు



నర్సింహాసాగర్‌లో పంటను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

మంగపేట: మండల పరిధిలో ఈ నెల 7న కురిసిన వడగండ్ల వర్షానికి 2,208.34 ఎకరాల్లో పంటనష్టం సంభవించినట్లు వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. మండల పరిధిలోని మల్లూరు. కొత్తమల్లూరు, నర్సింహాసాగర్, తిమ్మంపేట, బాలన్నగూడెం పంచాయతీల పరిధిలోని వివిధ గ్రామాల్లో రాళ్లవాన బీభత్సం సృష్టించగా చేపట్టిన సర్వే సోమవారంతో ముగిసిందని వెల్లడించారు. కలెక్టర్ దివాకర ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్ సిబ్బందితో ఏర్పాటు చేసిన 4 టీములతో కూడిన 16మంది అధికారులు ఆయా గ్రామాల్లో దెబ్బతిన పంటలను 14రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు వెల్లడించారు. అగ్రికల్చర్ కమిషనరేట్ నిబంధనల మేరకు 942మంది రైతులకు చెందిన 2,208.34ఎకరాల్లో పంటనష్టం సంభవించగా ఆ వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేసినట్లు వివరించారు.

గ్రామాల వారీగా పంటనష్టం వివరాలు ఇలా..

గ్రామం	బాధిత రైతుల సంఖ్య	ఎకరాలు
నర్సింహాసాగర్	323	829.12
నర్సింహాసాగర్ (ఆర్ఓఎఫ్ఆర్)	33	84.25
నరేందర్‌రావుపేట	21	46.09
శనిగకుంట	03	13.20
తిమ్మంపేట	194	431.06
అబ్బాయిగూడెం	01	01
మొట్లగూడెం	06	17.11
మెట్టుగూడెం	02	6.30
కొత్తమల్లూరు	01	01
మల్లూరు	184	441.37
బాలన్నగూడెం	63	94.25
చెరుపల్లి	111	242.24

గడువులోపు పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ రాహుల్‌శర్మ
- సరస్వతి పుష్కరాల పనుల పురోగతిపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గడువులోపు పనులను పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, దేవాదాయ శాఖ, ఆర్టీసీ, వివిధ శాఖల అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ శాఖల అధికారులు ఇప్పటికే పనుల షెడ్యూల్ ఇవ్వడం జరిగిందని, షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని పనులు చేపట్టాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పుష్కర ఏర్పాట్లు విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. గోదావరి నదిలో నీటి సామర్థ్యం నిశితంగా గమనిస్తూ ఉండాలని, గడిచిన 21 రోజుల నుంచి నీటి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్నామని, 13 సెంటిమీటర్లు నీరు తగ్గిందన్నారు. గత మే నెలలో గోదావరి నీటి మట్టం 94 మీటర్ల 540 సెంటిమీటర్లు ఉన్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు పంపాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్, డీపీఓ నారాయణరావు, జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్సూర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో ఎమ్మెల్సీ కవిత మాటామంతి



చల్వాయిలో ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న మహిళలు

గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాసేపు బీఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడారు. కవిత సోమవారం భద్రాచలం సీతారామచంద్ర స్వామిని దర్శించుకుని తిరుగుప్రయాణంలో వస్తుండగా చల్వాయి గ్రామంలో 10నిమిషాల పాటు కాన్వాయి ఆపి కార్యకర్తలను పలకరించారు. ఈ క్రమంలో మహిళలు కవితకు మంగళ హారతితో స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈ క్రమంలో గ్రామంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చి జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లకావత్ నరసింహనాయక్, తుమ్మల హరిబాబు, భూరెడ్డి మధు, పూర్ణచందర్, బొల్లం ప్రసాద్, ఆలూరి శ్రీను, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

గణితంతోనే అన్ని విభాగాల్లో పరిశోధనలు

నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఉమామహేశ్



మాట్లాడుతున్న నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎన్వీ.ఉమామహేశ

కాజీపేట అర్బన్ : గణితశాస్త్రం అన్ని విభాగాలతో ముడిపడి ఉంటుందని, వివిధ విభాగాల్లో నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు గణితంతోనే సాధ్యమని నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎన్వీ.ఉమామహేశ్ తెలిపారు. నిట్ వరంగల్ సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లోని హోమిబాబా హాల్‌లో సోమవారం మ్యాథమెటికల్ డిపార్ట్‌మెంట్, ఐఐటీ బాంబే నేషనల్ సెంటర్ ఫర్ మ్యాథమెటిక్స్, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ ముంబయి సౌజన్యంతో వారం రోజుల టీచర్స్ ఎన్‌రిచ్‌మెంట్ వర్క్‌షాప్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ–2020కి అనుగుణంగా ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఇందుకు ఈ వారం రోజుల వర్క్‌షాప్ వేదికగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నిట్ మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ సెల్వరాజ్, ప్రొఫెసర్లు రాజశేఖర్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ప్రోత్సాహం అందిస్తాం'

వరంగల్ క్రైం : జాతీయస్థాయి క్రీడల్లో రాణించే పోలీస్ క్రీడాకారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. గత నెలలో మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరిగిన 18వ జాతీయ పోలీస్ షూటింగ్ (స్పోర్ట్స్) చాంపియన్ షిప్‌లో తెలంగాణ పోలీస్ తరపున ప్రాతినిధ్యం వహించి 300 మీటర్ల మహిళా జట్టు విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన సుబేదారి ఏఎస్సై సువర్ణను సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ ఘనంగా సత్కరించారు.

వచ్చే నెలలో టీచర్లకు ట్రైనింగ్

- రిసోర్స్ పర్సన్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం
- డీఈఓ కార్యాలయాల్లో స్వీకరణ
- నేటినుంచి ఈనెల 24వరకు గడువు
- ఇంటర్వ్యూ, డెమో ద్వారా ఎంపికలు



విద్యారణ్యపురి: రాష్ట్రంలో ఉపాధ్యాయులకు వేసవిలో శిక్షణలు ఇవ్వనున్నారు. తొలుత ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులను మండల, జిల్లాస్థాయిలో రిసోర్స్ పర్సన్‌లుగా నియమించనున్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు ప్రకారం ఉమ్మడి జిల్లా పరిధి హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న మండల, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల, మోడల్‌స్కూల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఆసక్తి కలిగిన ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, గెజిటెడ్ హెడ్మాస్టర్లను రిసోర్స్‌పర్సన్‌లుగా ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం ఆయా జిల్లాల డీఈఓలు.. సదరు ఉపాధ్యాయులనుంచి ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రతీ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలనుంచి మండలస్థాయిలో రిసోర్స్ పర్సన్‌లుగా తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఈవీఎస్ సబ్జెక్టులనుంచి ఇద్దరు చొప్పున ఎంఆర్‌పీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లాస్థాయికి డీఆర్‌పీలుగా కూడా ఆయా సబ్జెక్టులకు ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున ఎంపిక చేసేందుకు దరఖాస్తులు తీసుకుంటారు. ఉర్దూ మీడియం, స్పెషల్ ఎడ్యుకేషన్‌నుంచి కూడా రిసోర్స్ పర్సన్‌లను నియమిస్తారు.

జిల్లాస్థాయిలో హైస్కూళ్లనుంచి..

ప్రతీ జిల్లానుంచి హైస్కూల్‌స్థాయిలో విద్యాబోధన చేస్తున్న టీచర్లు ప్రతీ సబ్జెక్టునుంచి నలుగురి చొప్పున 9 సబ్జెక్టులకు 36మందిని జిల్లాస్థాయి రిసోర్స్‌పర్సన్‌లుగా ఎంపిక చేస్తారు. ఉర్దూ మీడియంలో ఐదు సబ్జెక్టులకు ఇద్దరు చొప్పున పది మందిని నియమిస్తారు. దరఖాస్తులు తీసుకున్నాక అందులోనుంచి అవసరం మేరకు సంబంధిత అధికారులు ఎంపిక చేస్తారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు

ప్రతీ జిల్లాలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించాక ఏ జిల్లాకు ఆ జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. డెమో ద్వారా ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన జాబితాలను ఆయా జిల్లాల డీఈఓలు ఈనెల 28వ తేదీ వరకు రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణామండలికి, ఎస్ఈఆర్‌టీ అధికారులకు పంపనున్నారు. ఇదిలా ఉండగా హనుమకొండ జిల్లాలో ఆసక్తిగల తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు నిర్దేశించిన దరఖాస్తుల ఫారం ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ డి.వాసంతి సోమవారం కోరారు. ఇతర సమాచారం కోసం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎంపిక చేసిన రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ

ఎంపికైన మండల, జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్లకు ఆయా సబ్జెక్టుల వారీగా కూడా రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణామండలి అధికారులు త్వరలోనే సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్‌తో శిక్షణ ఇవ్వనున్నారు. వీరి ద్వారా జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణలు ఉంటాయని సమాచారం. గుణాత్మక విద్యను అమలుచేసేందుకు ఉపాధ్యాయులకు అందించే శిక్షణలకు ఈ రిసోర్స్‌పర్సన్‌లను వినియోగిస్తారు.

అగ్నివీర్ నియామకాలకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: భారత సైనిక దళంలో అగ్నివీర్ నియామకాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్యామల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 సంవత్సరానికి గాను అగ్నివీర్ నియామక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నియామకాల్లో అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్‌మన్ వర్గాల్లో నియామకాలు జరగనున్నట్లు తెలిపారు. అర్హత కలిగి అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఆర్‌పీల నియామకానికి..

జిల్లాలో ఆసక్తికలిగి ప్రభుత్వ ఉపాధ్యాయుల నుంచి రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ)ల నియామకానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్య నాణ్యతను పెంచడానికి, ఉపాధ్యాయులను వినూత్న వ్యూహాలు, ప్రభావితవంతమైన బోధన పద్ధతులతో సన్నద్ధం చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో శిక్షణ ఇవ్వడానికి సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్లను ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తులను అందించాలని, 28న ఇంటర్వ్యూ పద్ధతిలో ఎంపిక చేయనున్నారు.

క్లుప్తంగా

కొండపర్తిని సందర్శించిన గవర్నర్ కార్యదర్శుల బృందం



ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్‌తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామాన్ని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంయుక్త కార్యదర్శి భవాని శంకర్, వ్యక్తిగత కార్యదర్శి పవన్‌సింగ్ ఆధ్వర్యంలో ఇండియన్ ట్రైబల్ కేర్ ట్రస్ట్ జనరల్ కార్యదర్శి గోవింద దాసు, రాధా కన్నయ్య దాస్ బృందం సోమవారం సందర్శించింది. గ్రామంలో మహిళల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన మసాలా యూనిట్, టైలరింగ్ సెంటర్‌ను సందర్శించారు. వీటితో ఉపయోగాలు ఉన్నాయా అని సంఘంలోని సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వృత్తి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మధుకర్‌ను మసాలా యూనిట్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి గవర్నర్ సంయుక్త కార్యదర్శి భవాని శంకర్ అడిగి తెలుసుకున్నారు. మిక్సీ, పసుపు కొమ్ములు కొనుగోలు చేయడానికి అధిక వనరులు ఏర్పాటు చేయాలని, వృత్తి సంస్థ తరఫున మసాలా యూనిట్‌లో సంఘం సభ్యులకు టెక్నికల్ ట్రైనింగ్ ఇచ్చామని మధుకర్ తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ వీరభద్రం, విలేజ్ కోఆర్డినేటర్ సూదికొండ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

యథావిధిగా పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు

వాయిదా వేయాలని రిజిస్ట్రార్‌కు వినతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 26వ తేదీ నుంచి పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు యథావిధిగా నిర్వహించనున్నామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ సోమవారం తెలిపారు. కొద్దిరోజులుగా కొందరు పీజీ కోర్సుల విద్యార్థులు ఆయా నాలుగో సెమిస్టర్ల పరీక్షలు వాయిదావేయాలని అధికారులను కోరుతూ వస్తున్నారు. సోమవారం కూడా రిజిస్ట్రార్ రామచంద్రంను కలిసి విన్నవించారని సమాచారం. ఆ తర్వాత పీజీ కోర్సుల పరీక్షలు వాయిదావేశారనే అంశం యూనివర్సిటీలో ప్రచారం జరుగుతోంది. విద్యార్థుల పోరాట ఫలితంగా పరీక్షలు వాయిదావేశారని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఈనెల 26వ తేదీ నుంచి జరిగే పరీక్షలను సోమవారం వాయిదా వేయలేదన్నారు. అయితే విద్యార్థులు వాయిదావేయాలని కోరుతున్నారన్నారు. ఈవిషయంపై మంగళవారం యూనివర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల డైరెక్టర్, పరీక్షల విభాగం అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించి పీజీకోర్సుల నాలుగో సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించాలా.. వాయిదా వేయాలా అనే అంశం నిర్ణయిస్తామని రాజేందర్ తెలిపారు.

19 కేజీల గంజాయి పట్టివేత



డోర్నకల్: డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ వద్ద 19 కేజీల ఎండు గంజాయి పట్టుకుని నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు ఖమ్మం జీఆర్పీ సీఐ పి. అంజలి తెలిపారు. ఈ మేరకు డోర్నకల్ జీఆర్పీ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సోమవారం ఉదయం రైల్వే స్టేషన్‌లోని రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై తనతోపాటు డోర్నకల్ ఎస్సై జె.సురేశ్, సిబ్బంది తనిఖీ నిర్వహిస్తుండగా లగేజీతో ఓ మహిళ అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో అదుపులోకి తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించింది. అనంతరం సదరు మహిళను విచారించి పశ్చిమ బెంగాల్‌లోని గోస్పారాకు చెందిన మొల్లా నర్గీస్ బాబీగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన ఎండు గంజాయి విలువ రూ.4,75,000 విలువ ఉంటుందని పేర్కొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ.. ఇక క్షణాల్లోనే..



కరెంట్ అంతరాయాలు సులువుగా గుర్తించొచ్చు

- ప్రతీ స్తంభానికి నంబర్.. డిజిటలైజేషన్
- విద్యుత్ లైన్‌లో సమస్య ఉత్పన్నమైతే వెంటనే చేరుకునే అవకాశం..
- ఆపై వెంటనే పునరుద్ధరణ
- నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా టీజీ ఎన్పీడీసీఎల్ అడుగులు

హన్మకొండ: విద్యుత్ లైన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినా? అంతరాయం కలిగినా? వెంటనే.. వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సమస్యను త్వరితగతిన గుర్తించేందుకు పోల్ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టింది. ఈ క్రమంలో ప్రతీ స్తంభానికి నంబర్ కేటాయిస్తోంది. దీని ద్వారా ప్రతీ స్తంభానికి లెక్క ఉండడంతోపాటు ఎక్కడ సమస్య ఉత్పన్నమైందో పోల్ నంబరింగ్ ద్వారా సులువుగా తెలుసుకోవచ్చు. నంబర్ వేసిన ప్రతీ స్తంభాన్ని డిజిటలైజేషన్ చేస్తుండడంతో ఏ ప్రాంతంలో.. ఏ స్తంభం పరిధిలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనవో సులువుగా గుర్తించొచ్చని విద్యుత్ అధికారులు తెలిపారు. పోల్ నంబరింగ్, డిజిటలైజేషన్ ద్వారా సాంకేతిక సమస్యలను క్షణాల్లో గుర్తించి, వాటిని అధిగమించి వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించొచ్చు. అయితే పోల్ నంబరింగ్ పనులు వేగంగా జరుగుతున్నా, డిజిటలైజేషన్ ప్రక్రియ అంత త్వరగా జరగడం లేదు. పొలాల్లో పంటలు ఉండడంతో వ్యవసాయ ఫీడర్లలో నంబరింగ్ ప్రక్రియ పూర్తి కాలేదు. పంటలు కోతకు రావడంతో నంబరింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. వానాకాలం పంటలు సాగు చేసేలోపు ముందు నంబరింగ్ ప్రక్రియ పూర్తి చేసి, ఆ వెనువెంటనే డిజిటలైజేషన్ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. స్తంభాలకు రెండు రకాల రంగులతో నంబరింగ్ చేస్తున్నారు. 33 కేవీ ఫీడర్లలో స్తంభంపై పసుపు రంగు వేసి ఆ రంగుపై ఎర్రని రంగుతో నంబర్ వేస్తున్నారు. 11 కేవీ ఫీడర్లలో స్తంభానికి పసుపు రంగు వేసి ఈ రంగుపై నల్లని రంగుతో నంబర్ వేస్తున్నారు.

613 ఫీడర్లలో నంబరింగ్ పూర్తి

టీజీ ఎన్పీడీసీఎల్‌లో మొత్తం 33 కేవీ ఫీడర్లు 716 ఉండగా 613 ఫీడర్లలో నంబరింగ్ పూర్తయింది. ఇందులో 343 ఫీడర్లు డిజిటలైజేషన్ చేశారు. 11 కేవీ ఫీడర్లు మొత్తం 6,651 ఉండగా ఇందులో 3,245 ఫీడర్లు నంబరింగ్ పూర్తయ్యాయి. డిజిటలైజేషన్ 1,849 ఫీడర్లలో చేశారు. అదే విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అయిదు సర్కిళ్లలో 33 కేవీ ఫీడర్లు మొత్తం 195 ఉండగా 186 ఫీడర్లలో నంబరింగ్ పూర్తయింది. ఇందులో 49 ఫీడర్లు డిజిటలైజేషన్ చేశారు. అదే విధంగా 11 కేవీ ఫీడర్‌లు మొత్తం 1,727 ఉండగా 1,078 ఫీడర్లలో నంబరింగ్ పూర్తయింది. డిజిటలైజేషన్ 102 ఫీడర్లలో చేశారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 33 కేవీలో నంబర్ కేటాయింపు వివరాలు

సర్కిల్	మొత్తం ఫీడర్లు	పూర్తయిన ఫీడర్లు	డిజిటలైజేషన్
వరంగల్	34	34	22
హనుమకొండ	40	32	10
జనగామ	44	43	--
భూపాలపల్లి	39	39	--
మహబూబాబాద్	38	38	17

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 కేవీలో నంబర్ కేటాయింపు వివరాలు

సర్కిల్	మొత్తం ఫీడర్లు	పూర్తయిన ఫీడర్లు	మిగిలిన ఫీడర్లు	డిజిటలైజేషన్
వరంగల్	339	185	154	70
హనుమకొండ	347	320	27	--
జనగామ	375	361	14	--
భూపాలపల్లి	343	143	200	32
మహబూబాబాద్	323	64	254	--



భీమదేవరపల్లిలో 33 కేవీ లైన్‌లో స్తంభానికి వేసిన నంబర్



భీమదేవరపల్లిలో 11 కేవీ లైన్‌లో విద్యుత్ స్తంభానికి వేసిన నంబర్

సమస్య సులువుగా గుర్తించొచ్చు

ఈదురుగాలులు, వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు విద్యుత్ లైన్‌లో సమస్యలు తలెత్తుతాయి. తద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగి వినియోగదారులు ఇబ్బందులు పడుతారు. ఈ నేపథ్యంలో డిజిటలైజేషన్ ద్వారా సమస్య ఎక్కడ తలెత్తిందో త్వరగా తెలుసుకోవచ్చు. బదిలీలు, నూతన నియామకాల సందర్భంగా కొత్తగా వచ్చే ఉద్యోగులు కూడా నంబరింగ్ ద్వారా సులువుగా తెలుసుకుంటారు. తద్వారా సిబ్బంది వెంటనే చేరుకుని వేగంగా సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఏదేనీ సమస్య గుర్తించినప్పుడు విద్యుత్ సిబ్బందికి స్పష్టమైన సమాచారం అందించేందుకు పోల్ నంబరింగ్ దోహదపడుతుంది.

లొకేషన్ త్వరగా గుర్తించొచ్చు



పోల్ నంబరింగ్, డిజిటలైజేషన్ ద్వారా లొకేషన్‌ను త్వరగా గుర్తించొచ్చు. విద్యుత్ లైన్లలో ఏదేని సమస్య ఉత్పన్నమైతే సిబ్బందికి స్పష్టమైన సమాచారం అందించడానికి పోల్ నంబర్ తోడ్పడుతుంది. తద్వారా సిబ్బంది వెంటనే చేరుకుని విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తారు.

\- టి.వేణుమాధవ్, ఎస్ఈ, జనగామ

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు..



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం సాంకేతికతకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలోనే విద్యుత్ స్తంభాల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాం. వానాకాలంలోపు పోల్ నంబరింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాం.

\- పి.మధుసూదన్ రావు, ఎస్ఈ, హనుమకొండ

డీజిల్ లోకోషెడ్ అభివృద్ధికి కృషి చేయాలి

- రైల్వే సీనియర్ డీఎంఈ వెంకటకుమార్



మాట్లాడుతున్న రైల్వే సీనియర్ డీఎంఈ వెంకటకుమార్

కాజీపేట రూరల్ : కాజీపేట డీజిల్ లోకోషెడ్‌ను అభివృద్ధి చేయడంతోపాటు భారతీయ రైల్వేలో ఈ షెడ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి కలిసికట్టుగా కృషి చేయాలని డీజిల్‌షెడ్ సీనియర్ డీఎంఈ ఎన్.వి.వెంకటకుమార్ అన్నారు. కాజీపేట డీజిల్‌లోకోషెడ్‌లో సోమవారం షెడ్ 52వ వసంతాల వేడకలను కేక్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌వైజర్లు, కార్మికుల కృషితో డీజిల్, ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లు అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నాయని అభినందించారు. ఇటీవల షెడ్‌లో వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలిచిన కార్మికులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక అంశాలు అలరించాయి. కార్యక్రమంలో డీజిల్‌షెడ్ డీఎంఈ అనికేత్ ఖడ్గే, ఏడీఎంఈలు భానుప్రకాశ్, నాగరాజశేఖర్, ఏసీఎంటీ రవీంద్రకుమార్, ఎ.ఎం.ఎం రాజేశ్, ఎల్.ఎఫ్ ఎం.రాజశేఖర్, ఈ.ఎఫ్ రమేశ్‌కుమార్, రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, రైల్వే ఓబీసీ, రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్, రైల్వే డీఎంఆర్‌కెఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు



సభాస్థలి ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, సతీశ్‌కుమార్, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు కిషన్‌రావు, వెంకన్న, వాసుదేవరెడ్డి, సతీశ్‌రెడ్డి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఎల్కతుర్తి: తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో సాగు, తాగునీటి కష్టాలు మొదలయ్యాని, పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వచ్చాయని, దీనికి కారణం అసమర్థత పాలనేనని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లి సమీపంలో ఈనెల 27న నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి సాధించుకున్న తెలంగాణకు మళ్లీ అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకోరని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కరెంట్ రాక.. నీళ్ల లేక పంటలు ఎండిపోయి మళ్లీ రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కోపాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగుపడుతుందని ప్రజలు భావిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సభా ప్రాంగణ ఏర్పాట్లును పరిశీలించారు. ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు లింగపల్లి కిషన్‌రావు, నాగుర్ల వెంకన్న, వాసుదేవరెడ్డి, సతీశ్ రెడ్డి, నాయకులు చింతం సదానందం, కడారి రాజు, జి.మహేందర్, ఎల్తూరి స్వామి, టి.మహేందర్, నగేశ్, పి.మహేందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆర్ఐ

- చిల్పూరు తహసీల్ కార్యాలయంలో ఘటన



లింగయ్య (బాధితుడు)



ఏసీబీకి పట్టుబడిన ఆర్ఐ వినిత్

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఒక వ్యక్తి నుంచి రూ.26వేలు లంచం తీసుకుంటూ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి ఆవుల బుచ్చయ్యకు రాజయ్య, లింగయ్య ఇద్దరు కుమారులు. తొమ్మిది నెలల క్రితం బుచ్చయ్య మృతి చెందాడు. నెల రోజుల అనంతరం తండ్రి పేర ఉన్న ఎకరం 23 గుంటల భూమిని చెరిసగం తమ పేర చేయాలని లింగయ్య తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. స్లాట్ బుక్ చేసుకోవాలని ఆర్ఐ చీకట్ల వినిత్ తెలపడంతో 'మీసేవ' ద్వారా రూ.5,500 చెల్లించి బుక్ చేయించాడు. అనంతరం ఆర్ఐని కలువగా రిజెక్ట్ అయినందున మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవాలనగా బుక్ చేసి ఆర్ఐని కలువగా త్వరలో అయిపోతుందని చెప్పాడు. రెండు నెలలు గడుస్తున్నా పనికాక పోవడంతో లింగయ్య కార్యాలయానికి వెళ్లి గొడవ చేయగా భూమి మీ పేర కావాలంటే రూ.45 వేలు ఇవ్వాలని ఆర్ఐ డిమాండ్ చేశాడు. బతిమిలాడినా వినక పోవడంతో చివరకు రూ.30వేలకు ఒప్పందం చేసుకుని రూ.4వేలు చెల్లించాడు. సోమవారం మిగతా రూ.26 వేలు ఇవ్వాల్సి ఉండగా ఈనెల 19న ఏసీబీ అధికారులను ఆశ్రయించిన లింగయ్య వారి సూచన మేరకు సోమవారం సాయంత్రం ఆర్ఐ కారులో కూర్చుని ఉండగా వెళ్లి డబ్బులు ఇవ్వగా లెక్కిస్తుండగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్లు ఎల్.రాజు, ఎస్.రాజు పట్టుకున్నారు. కార్యాలయంలోని గదికి తీసుకెళ్లి కేసు నమోదు చేశారు.

కుల, మతాల పేరుతో బీజేపీ చిచ్చు



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎంపీ బలరాం నాయక్, ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ కొప్పుల రాజు, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, తదితరులు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

హన్మకొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుల, మతాల పేరుతో చిచ్చు పెడుతోందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన 'బునియాదీ కార్యకర్త సమ్మేళన్' సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆదివాసీలపై దాడులు పెరిగాయన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టుదలతో ముందుకెళ్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. రాష్ట్రంలో పేదల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మూడు రోజు పాటు శిక్షణలో తెలుసుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరవేసి పార్టీని పటిష్టం చేయాలన్నారు. ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ కొప్పుల రాజు మాట్లాడుతూ బీఆర్ఎస్, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ నాయకుడు విక్రాంత్ బునియా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు



జనగామ రూరల్: చెల్లని చెక్కు ఇచ్చిన జనగామ జిల్లా తరిగొప్పుల మండలం బొంత గట్టు నాగారం మాజీ సర్పంచ్ ఇరుమళ్ల రాజయ్యకు ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 7 లక్షల జరిమానా విధిస్తూ జనగామ జిల్లా ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి. శశి సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా నర్మెట గ్రామానికి చెందిన గంగుల శ్రీనివాస్ రెడ్డికి మాజీ సర్పంచ్ ఇరుమళ్ల రాజయ్య రూ.6 లక్షల 66 వేల అప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో 2016 ఆగస్టు 9వ తేదీన రాజయ్య తన అప్పును నగదుకు బదులు చెక్కు రూపేణ ఇచ్చాడు. ఈ చెక్కు చెల్లకపోవడంతో శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన మేజిస్ట్రేట్.. రాజయ్యకు ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 7 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు బాధితుడి తరపున న్యాయవాది ఎలగందుల చంద్రరుషి తెలిపారు.

సామాజిక కార్యకర్త కిడ్నాప్.. హత్య!

- పోలీసుల అదుపులో నిందితులు
- నిందితుల్లో కానిస్టేబుల్?



సాయిప్రకాశ్ (ఫైల్)

వరంగల్ క్రైం: ములుగు జిల్లా వెంకటాపూర్ (కె) మండల కేంద్రానికి చెందిన 'చేయూత'స్వచ్ఛంద సంస్థ కార్యకర్త చేడం సాయి ప్రకాశ్(30)ను కిడ్నాప్ చేసి హత్యకు పాల్పడినట్లు తెలిసింది. పోలీసులు, అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సాయి ప్రకాశ్ ఈనెల 15న వెంకటాపూర్ నుంచి హనుమకొండకు తన బంధువులను ఆస్పత్రికి తీసుకొచ్చాడు. ఆ తర్వాత తన ఆచూకీ తెలియకపోవడంతో ఈనెల 16, 17 తేదీల్లో వెతికిన అనంతరం 18న బంధువులు హనుమకొండ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తులో భాగంగా సాయిప్రకాశ్ హనుమకొండకు వచ్చిన ఆస్పత్రి, ఆ తరువాత వెళ్లిన దృశ్యాలను సీసీ టీవీ ఫుటేజీల ద్వారా పరిశీలించారు. తన ఫోన్ ద్వారా ఆచూకీ కనిపెట్టే ప్రయత్నం చేశారు. అయినప్పటికి వివరాలు రాకపోవడంతో ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటికే సాయి ప్రకాశ్‌ను కిడ్నాప్ చేసిన దుండగులు కరీంనగర్‌లో హత్య చేసినట్లు తెలిసింది. దీంతో సాయి ప్రకాశ్‌కు ఎవరితో శతృత్వం ఉందనే కోణంలో విచారణ చేపట్టడంతో నిందితుల సమాచారం తెలిసినట్లు తెలిసింది.

నిందితుల్లో కానిస్టేబుల్?

సాయి ప్రకాశ్ హత్య సంఘటనలో పాల్గొన్న నిందితుల్లో ఓ కానిస్టేబుల్ ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సమాచారం. హనుమకొండలో సాయి ప్రకాశ్‌ను కిడ్నాప్ చేసి కరీంనగర్‌లో హత్య చేసినట్లు గుర్తించారు. ఈ హత్యకు గతంలో వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఓ కానిస్టేబుల్ ప్రధాన కారణమని తెలిసింది. సాయి ప్రకాశ్ బంధువుల్లో ఓ మహిళతో కానిస్టేబుల్ వివాహేతర సంబంధం విషయంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిసింది. దానిని మనస్సులో పెట్టుకుని సాయి ప్రకాశ్‌ను కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు తెలిసింది. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రాణం తీసిన చిన్న గొడవ..

- వ్యక్తి దారుణ హత్య..
- జనగామ జిల్లా రేగుల తండాలో ఘటన



శ్రీను(ఫైల్)

కొడకండ్ల : చిన్న గొడవ ఒకరి ప్రాణం తీసింది. ఎద్దులను కట్టేసిన విషయంలో ఇరువురి మధ్య చిన్న గొడవ జరగగా అది మనసులో పెట్టుకున్న నిందితుడు.. ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం రేగుల తండాలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ శ్రీను (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత శ్రీను తన ఇంటి ఎదుట నిద్రిస్తుండగా అతడి కుమారుడు వెంకన్న ఇంటి స్లాబ్‌పై, భార్య భూలి ఇంట్లో నిద్రించారు. ఇదే తండాకు చెందిన గుగులోత్ జేత్రామ్ పదిహేనేళ్ల క్రితం తండా నుంచి వెళ్లి హనుమకొండలో ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. సుమారు సంవత్సరం క్రితం జేత్రామ్ ఇంటి వెనుక దారిలో శ్రీను తన ఎద్దులను కట్టేసిన విషయంలో ఇరువురి మధ్య చిన్న గొడవ జరిగింది. దీనిని మనసులో పెట్టుకున్న జేత్రామ్ ఆదివారం రాత్రి 10.15 గంటల ప్రాంతంలో ఆటోలో తండాకు వచ్చాడు. ఇంటి ఎదుట నిద్రిస్తున్న శ్రీనుపై కత్తితో విచక్షణారహితంగా పొడిచాడు. శ్రీను అరవగా కుమారుడు, భార్య రావడంతో నిందితుడు ఆటోలో పరారయ్యాడు. అప్పటికే కత్తి పోట్లకు గురైన శ్రీను తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు, తండా వాసులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, నిందితుడు జేత్రామ్ గతంలో తన సొంత అన్నపై కూడా గొడ్డలితో దాడికి పాల్పడ్డాడని, తండాకు ఎప్పుడోసారి వచ్చి పోయే అతనిది నేరప్రవృత్తి అని తండావాసులు తెలిపారు. మృతుడి కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి, కొడకండ్ల ఎస్సై చింత రాజు తెలిపారు.

నివాళులర్పించిన ఎర్రబెల్లి..

శ్రీను మృతదేహం వద్ద మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

బైక్‌ను ఢీకొన్న కారు..

- యువకుడి దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం
- నెల్లుట్ల సమీపంలో ఘటన



కల్యాణ్ (ఫైల్)

లింగాలఘణపురం: కారు ఎదురుగా బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సోమవారం జనగామ – సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల సమీపంలో గుడిసెవాసుల కాలనీ వద్ద చోటు చేసుకుంది. ఎస్సై శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని నవాబుపేటకు చెందిన బోళ్ల కల్యాణ్ (26), బూడిద సాయి ద్విచక్రవాహనంపై జనగామ నుంచి నవాబుపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పాలకుర్తి మండలం మొడ్రాయి తాటిపాముల గ్రామానికి చెందిన మహేశ్ తన భార్యతో కారులో హైదరాబాద్ వెళ్తున్నాడు. కుందారం క్రాస్ దాటి గుడిసెవాసుల కాలనీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో కల్యాణ్, సాయి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 వాహన పైలెట్ నరేశ్‌కుమార్, ఈఎంటీ శ్రవణ్‌కుమార్.. క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కల్యాణ్ మృతి చెందాడు. సాయి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, కల్యాణ్ జనగామలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తూ కుటుంబానికి ఆసరా అవుతున్నాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

టిప్పర్ ఢీకొని వివాహిత మృతి..

వరంగల్ క్రైం: సుబేదారి పీఎస్ పరిధిలోని ఖమ్మం ఫ్లైఓవర్ దగ్గర టిప్పర్.. బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఓ వివాహిత అక్కడికక్కడే మృతి చెందింది. సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి కథనం ప్రకారం.. మహబుబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం కాచికల్‌కు చెందిన ఉమ (28) తన భర్త, కొడుకుతో కలిసి సోమవారం బైక్‌పై వరంగల్ వచ్చింది. పని పూర్తయిన అనంతరం ఇంటికి వెళ్తుండగా ఫ్లైఓవర్ వద్ద టిప్పర్ వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఉమ ఎగిరి కింద పడగా టిప్పర్ ఆమెపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వడదెబ్బతో ఇద్దరు మహిళలు మృతి



ప్రేమలత మృతదేహం



స్వాతి(ఫైల్)

తొర్రూరు రూరల్: వడదెబ్బతో ఓ మహిళా రైతు మృతి చెందింది. ఈ ఘటన సోమవారం మండలంలోని చెర్లపాలెంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహిళా రైతు హనుమాండ్ల ప్రేమలత (55) తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో ఆరబెడుతోంది. ఈ క్రమంలో వడదెబ్బ తాకడంతో అస్వస్థతకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కాట్రపల్లిలో మహిళా కూలీ..

సంగెం: వడదెబ్బతో ఓ మహిళా కూలీ మృతి చెందింది. ఘటన సంగెం మండలం కాట్రపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గీసగోని శ్రీదేవి అలియాస్ స్వాతి (33) ఆదివారం మొక్కజొన్న కంకి విరవడానికి వెళ్లింది. ఎండవేడిమికి వాంతులు అవుతుండడంతో సహ కూలీలు వెంటనే ఇంటికి తీసుకొచ్చారు. వాంతులు తగ్గకపోవడంతో 108లో వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త శ్రీధర్, కుమారుడు సుశాంత్, కూతురు సమీక్ష ఉంది. కాగా, నిరుపేద కుటుంబానికి చెందిన స్వాతి భర్త శ్రీధర్ ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్వాతి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.